క్లుప్తంగా

గుంటూరు వెళ్లి పింఛను అందజేత



గుంటూరులో కొప్పుల సంసోన్‌కు పెన్షన్ అందజేస్తున్న వలంటీర్ నిట్టా చిన్నారి

దెందులూరు: కొవ్వలి గ్రామానికి చెందిన కొప్పుల సంసోను గుంటూరు వైద్యశాలలో కిడ్నీ వ్యాధికి సంబంధించిన చికిత్స పొందుతున్నారు. సోమవారం కొవ్వలి క్లస్టర్ సీ-9 వలంటీర్ నిట్టా చిన్నారి గుంటూరు వెళ్లి పింఛను నగదును కొప్పుల సంసోన్‌కు అందజేశారు. గుంటూరు వెళ్లి కిడ్నీ బాధితుడికి పెన్షన్ అందజేసిన వలంటీర్ చిన్నారిని దెందులూరు ఏఎంసీ వైస్ చైర్మన్ కాటి సుధాకర్, వైస్ ఎంపీపీ గొల్ల నాగరాజు, సర్పంచ్ ఇంటేటి మధులత,, సొసైటీ చైర్మన్ కొమ్మిన రాము, ఎంపీటీసీ గొరిపర్తి వరలక్ష్మి రంగారావు అభినందించారు.

గ్రీన్ అంబాసిడర్లకు సత్కారం



గోపన్నపాలెంలో గ్రీన్ అంబాసిడర్లను సత్కరిస్తున్న సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి

దెందులూరు: గ్రామాలను శుభ్రంగా ఉంచి ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు పాటుపడుతున్న గ్రీన్ అంబాసిడర్ల సేవలు చిరస్మరణీయమని గోపన్నపాలెం సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి కుమార్ అన్నారు. సోమవారం గోపన్నపాలెం గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న ఆరుగురు గ్రీన్ అంబాసిడర్లను సర్పంచ్, గ్రామ కార్యదర్శి సామ్యూల్‌బాబు, సచివాలయ ఉద్యోగులు ఘనంగా సత్కరించి, వస్త్రాలు అందజేసి జ్ఞాపికను బహూకరించారు.

సమష్టి కృషితో 'స్వచ్ఛ గ్రామం' సాధిద్దాం



ఉంగుటూరులో ర్యాలీలో పాల్గొన్న ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, సర్పంచి సింధు

ఉంగుటూరు: సమష్టి కృషితో స్వచ్ఛ గ్రామం లక్ష్యం సాధించి గాంధీ కలలను సాకారం చేద్దామని ఉంగుటూరు ఎంపీపీ గంటాశ్రీలక్ష్మి అన్నారు. సోమవారం ఉంగుటూరులో గాంధీ జయంతి సందర్భంగా స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా ర్యాలీలు, గ్రామ సభలు నిర్వహించారు. ఉంగుటూరులో సర్పంచి బండారు సింధు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి గాంధీ చిత్రపటానికి పూల మాల వేసినివాళులర్పించారు. ఉప సర్పంచి పాతూరి జగదీష్, వార్డు మెంబర్లు పాల్గొన్నారు. గోపినాథపట్నంలో సర్పంచి పుత్సకాయల విష్ణుమూర్తి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎంపీపీ, గ్రామ ప్రజలు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

భీమడోలు: రైతుల సమస్యలపై అవగాహన కోసం ఈనెల 12, 13వ తేదీల్లో ఏలూరులో నిర్వహించనున్న జిల్లాస్థాయి శిక్షణ తరగతులు, సదస్సును విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. భీమడోలులో ప్రజాసంఘాల కార్యాలయం వద్ద సోమవారం రైతు సంఘం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి శిక్షణ తరగతుల కరపత్రాలను వారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి జిల్లాల్లో 28 మండలాలకు చెందిన 150 మంది రైతు ప్రతినిధులు, రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.కేశవరావు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కర రావు, ప్రతినిధులు పి.మురళీకృష్ణ, మార్ని రామకృష్ణ పాల్గొన్నారు.

పారిశుధ్య సిబ్బందికి వైద్య పరీక్షలు

ఏలూరు రూరల్: స్వచ్ఛతా హీ సేవలో భాగంగా ఎంపీడీఓ బి.ప్రణవి, ఈఓపీఆర్డీ ఎం సరళ కుమారి పర్యవేక్షణలో ఏలూరు మండలం చాటపర్రులో సోమవారం పారిశుధ్య సిబ్బందికి ఉచిత వైద్యసేవ కార్యక్రమం గ్రామ కార్యదర్శి రవీంద్ర నిర్వహించారు. వైద్యులు ఎస్ చందనవల్లి, కె.ప్రదీప్తి ఆధ్వర్యంలో 54 మంది పారిశుధ్య సిబ్బందికి వైద్య పరీక్షలు చేశారు. ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు, సర్పంచ్ గుడిపూడి రఘు పాల్గొన్నారు.

కరాటేలో నిషితసాయికి బంగారు పతకం

ఏలూరు రూరల్: ఏలూరుకు చెందిన ఎం నిషితసాయి కరాటే పోటీల్లో బంగారు పతకం సాధించింది. ఆదివారం ఏలూరులోని టుబాకో మర్చంట్స్ చాంబర్ కళ్యాణ మండపంలో రాష్ట్ర స్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో నిషితసాయి ఏడేళ్ల వయస్సు విభాగంలో బంగారు పతకం సొంతం చేసుకుంది. ఆమెకు శిక్షణ అందిస్తున్న స్ప్రింగ్‌బోర్డు అకాడమీ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

అర్హులందరికీ పథకాలు అందించడమే లక్ష్యం

- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి
- నాయుడుగూడెంలో గడపగడపకు మన ప్రభుత్వం



పెదపాడు: నాయుడుగూడెంలో పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కొఠారు



పెదవేగి: రాయన్నపాలెంలో గణనాథుని ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే

పెదపాడు: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యమని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. పెదపాడు మండలంలోని నాయుడుగూడెంలో బుధవారం రాత్రి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గడపగడపకు వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం వారి సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి దృష్టికి తీసుకువచ్చారు. డ్రెయినేజీలు నిర్మించాలని, రహదారులు అభివృద్ధి చేయాలని, ఇళ్ల స్థలాలు అందించాలని, ఇంటి రుణం అందించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల పక్షపాతి ముఖ్యమంత్రి జగన్ అని అన్నారు. అందుకే ప్రతి కుటుంబానికి రూ.1లక్ష నుంచి రూ.7లక్షల వరకు పథకాల ద్వారా లబ్ధి చేకూర్చారని వివరించారు. మరలా పథకాలు కొనసాగాలంటే సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు మద్దతు కొనసాగించాల్సిన అవసరముందన్నారు. సంక్షేమ పథకాలు అర్హులందరికీ ఇంటింటికీ అందించడానికి గ్రామ సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల వ్యవస్థను ప్రవేశపెట్టారని గుర్తు చేసారు. ప్రజలకు సక్రమంగా పథకాలు చేరవేస్తున్న వలంటీర్లపై కొంతమంది లేని ఆరోపణలు చేయడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ అధ్యక్షుడు అప్పన కనకదుర్గాప్రసాద్, పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నకుమారి, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, జిల్లా రైస్ మిల్లర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు ఆళ్ల సతీష్ చౌదరి, పెదపాడు సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్, గ్రామసచివాలయాల మండల కన్వీనర్ అక్కినేని గోపీచంద్ర దుర్గాప్రసాద్, విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు కత్తుల రవికుమార్ గ్రామ సర్పంచ్ సిద్ధాబత్తిన జోజమ్మ, ఎంపీటీసీ మారుమూడి కృపామణి, గోపి, ఘంటసాల ప్రభాకరరావు, రెడ్డి స్వర్ణకుమారి, వ్యవసాయ సలహా మండల అధ్యక్షుడు గొట్టాపు నర్సింహరావు, నాయకులు కడిమి గోవిందరావు, చేపేని రంగరావు, ఘంటసాల మోషే, ముంగర రమేష్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను వేగవంతంగా పరిష్కరించేందుకు కృషి

పెదవేగి : ప్రజల సమస్యలను వేగవంతంగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పనిచేస్తున్నారు. పెదవేగి మండలం కొండలరావుపాలెం క్యాంపు కార్యాలయంలో సోమవారం దెందులూరు నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించి, వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి ఆదేశించారు. అనంతరం పెదవేగి మండలం రాయన్నపాలెం గ్రామం కొత్తూరులో వినాయక నిమజ్జనం సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజలో ఎమ్మెల్యే పాల్గొని గణనాథుడిని దర్శించుకున్నారు. అనంతరం అన్నసమారాధనలో పాల్గొని, ఊరేగింపును ప్రారంభించారు.

డయాలసిస్ పింఛన్ అందజేత

పెదవేగి మండలం రాయన్నపాలెంకు చెందిన డయాలసిస్ బాధితురాలు జుజ్జువరపు రంగమ్మకి మంజూరైన రూ.10 వేలు డయాలసిస్ పింఛన్ వారి ఇంటికి వెళ్లి ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అందించారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు పలు గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం

ఉంగుటూరు: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం మంగళవారం ఉదయం 9 గంటల నుంచి చిన్న వెల్లమిల్లిలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఆంజనేయ బాబు తెలిపారు. పలువురు వైద్యులు పాల్గొని వైద్యసేవలు అందిస్తారని తెలిపారు. చిన్న వెల్లమిల్లి, చింతాయిగూడెం, లంబాడిగూడెం గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

భీమడోలు సచివాలయం వద్ద..

భీమడోలు: భీమడోలు సచివాలయం-1 వద్ద మంగళవారం 9 గంటల నుంచి నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పాల్గొంటారని భీమడోలు వైసీపీ మండల కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు సోమవారం తెలిపారు. భీమడోలు సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరంలో వైద్యనిపుణుల పర్యవేక్షణలో రోగులకు ఉచితంగా వైద్య సేవలందిస్తారని తెలిపారు. ప్రజలు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

నేడు కూచింపూడిలో ..

పెదవేగి : మండలంలోని కూచింపూడి గ్రామ సచివాలయం వద్ద మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ జి రాజ్‌మనోజ్ అన్నారు. ఈ శిబిరంలో నలుగురు వైద్యునిపుణులు హాజరై వైద్య పరీక్షలు చేస్తారని తెలిపారు. ఇటీవల కూచింపూడిలో ఏఎన్ఎంలు, సీహెచ్‌ఓలు,వలంటీర్లు ఆశా కార్యకర్తలు సంయుక్తంగా సర్వే నిర్వహించారని ఎంపీడీఓ చెప్పారు. ఆ సర్వేలో టోకెన్లు అందుకున్న వారు వైద్య శిబిరానికి హాజరు కావాలని ఆయన చెప్పారు.

గాంధీజీ ఆశయాల సాధన అందరి బాధ్యత



పెదనిండ్రకొలనులో విద్యార్థులకు బహుమతులు అందజేసిన ఎమ్మెల్యే వాసుబాబు



పిప్పర గ్రంథాలయంలో మాట్లాడుతున్న ఇందుకూరి రామకృష్ణంరాజు



ఉంగుటూరులో గాంధీ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించిన నాయకులు



పూళ్లలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న సర్పంచ్ దాయం సుజాత ప్రసాద్, వైసీపీ నేతలు



దెందులూరులో గాంధీజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తహసీల్దార్, అధికారులు

గణపవరం: మహాత్మగాంధీ ఆశయాలు సాధించేందుకు మనమంతా కంకణబద్ధులు కావాలని, ఆ లక్ష్య సాధనకు సమష్టి కృషి చేయాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం ఛైర్మన్ ఇందుకూరి రామకృష్ణంరాజు అన్నారు. సోమవారం పిప్పర శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన గాంధీ జయంతి వేడుకలలో ఆయన పాల్గొన్నారు. గాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కొత్తపల్లిలో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు గాంధీ జయంతి సందర్భంగా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ గాంధీ బాటలో నడిస్తే సమాజంలో శాంతి సౌభాగ్యాలు నెలకొంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అర్ధవరం రాము, జెడ్పీటీసీ సభ్యురాలు దేవారపు సోమలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు. మండలంలోని వాడవాడలా గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. గణపవరం పంచాయతీలో సర్పంచ్ మూర అలంకారం, పిప్పర, అర్ధవరం, సరిపల్లె, కొమ్మర, కేశవరం, కొందేపాడు, చిలకంపాడు, కాశిపాడులో గాంధీ జయంత్యుత్సవాన్ని నిర్వహించారు.

గాంధీ ఆశయాలే దేశానికి శిరోధార్యం

ఉంగుటూరు: గాంధీ ఆశయాలే దేశానికి శిరోధార్యమని పలువురు వక్తలు అన్నారు. సోమవారం ఉంగుటూరు స్వాతంత్రయోధుల స్మారక స్తూపం వద్ద గాంధీ విగ్రహానికి ఏఎంసీ మాజీ చైర్మెన్ కొండ్రెడ్డి సర్వేశ్వరరావు ఆధ్వర్యంలో పూలమాలల వేసి నివాళులర్పించారు. ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి జాతీయ జెండాను ఎగుర వేశారు. గాంధీ చిత్రపటానికి పూల మాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచి బండారు సింధు, గాంధేయ వాది చల్లా సూర్యారావు, పాండ్రాకుల శ్రీనివాసరావు, మారిశెట్టి సత్యనారాయణ, కోరాడ శివ, గుండుబోగుల తాతయ్య, పాతూరి వంశీ, తల్లాప్రగడ శివ రామ్ పాల్గొన్నారు.

గ్రామాల్లో గాంధీ జయంత్యుత్సవం

ఉంగుటూరు: గాంధీ జయంతి సందర్భంగా సోమవారం ఎ.గోకవరం పంచాయతీ ఆఫీసు వద్ద సర్పంచి మిద్దే సత్యవతి వెంకటేశ్వరరావు గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామ సమావేశం నిర్వహించారు. చేబ్రోలు గాంధీ విగ్రహం వద్ద మాజీ సర్పంచి కరణం బుజ్జి ఆధ్వర్యంలో గాంధీ జయంతి నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, ఎంపీటీసీ సభ్యులు రాయిలక్ష్మి, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్య స్థాపనలో భాగస్వామ్యులు కండి

భీమడోలు: గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్య స్థాపనలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని పలువురు వక్తలు అన్నారు. మండలంలోని వాడవాడలా జాతిపిత మహాత్మ గాంధీజీ 155వ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. భీమడోలులోని గాంధీబొమ్మ సెంటర్ వద్ద మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గాంధీ జయంతి నిర్వహించారు. పూళ్లలో సర్పంచ్ దాయం సుజాత ప్రసాద్, ఏఎంసీ ఉపాధ్యక్షుడు పులిచర్ల వెంకటకృష్ణారావు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసారు. భీమడోలు రిటైర్డ్ ఉద్యోగుల విశ్రాంతి భవనంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గాంధీజీ జయంతి నిర్వహించారు. కాంగ్రెస్ నాయకుడు యర్రంశెట్టి ఏడుకొండలు, మానవత శాంతిరథాల కమిటీ చైర్మన్ అప్పక రాంబాబు, మండల చైర్మన్ గుల్ల నూకరాజు, మానవత మండల అధ్యక్షుడు వట్టి సుగుణాకరరావు, సామాజిక కార్యకర్త మండే సుధాకర్, పెద్దలు పాలేటి బ్రహ్మారావు, వై.శ్రీనివాసరావు, వసంతరావు, ఎం.రాజు, నియోజకవర్గ యువజన అధ్యక్షుడు వై.సాయినాగబాబు పాల్గొన్నారు.

గాంధీజీ ఆశయాలు కొనసాగాలి

దెందులూరు: మహాత్మగాంధీజీ ఆశయాలు అమలు చేయడమే ఆయనకు అర్పించే ఘన నివాళి అని దెందులూరు తహసీల్దార్ ఎన్వీ నాంచారయ్య అన్నారు. సోమవారం దెందులూరు తహసీల్దార్ కార్యాలయంలో దెందులూరు వీఆర్ఓల సంఘం అధ్యక్షుడు కిషోర్ అధ్యక్షతన గాంధీజీ జయంతిని నిర్వహించారు. తహసీల్దార్ ఎన్వీ నాంచారయ్య, డిప్యూటీ తహసీల్దార్ హరిప్రసాద్ గాంధీజీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దెందులూరు నర్సింగ్ కళాశాలలో కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు ఆధ్వర్యంలో లాల్‌బహదూర్ శాస్త్రి, గాంధీజీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నర్సింగ్ విద్యార్థులు నివాళులర్పించారు. సోమవరప్పాడు సెయింట్ జాన్స్ బీఈడీ కళాశాలలో ఏలూరు పీఠం వికార్ జనరల్ డాక్టర్ ఫాదర్ పి.బాల ఆధ్వర్యంలో గాంధీజీ జయంతిని నిర్వహించారు. అధ్యాపకులు అగస్టీన్, సాల్మన్, విద్యార్థులు పాల్గొన్నారు. గోపన్నపాలెం వ్యాయామ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ నత్తానియేల్ ఆధ్వర్యంలో గాంధీ జయంతి నిర్వహించారు.

అహింసావాదంతోనే సమాజాభివృద్ధి

నిడమర్రు: మహాత్మగాంధీ అహింసా వాదంతోనే బ్రిటిష్‌వారిని గడగడలాడించి, దేశం నుండి తరిమికొట్టారని, మనం కూడా ఆయన బాటలోనే నడవాలని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. సోమవారం గణపవరం మండలం పెదనిండ్రకొలను గాంధీభవన్‌లో సర్వోదయ మండలి, మానవత ఆధ్వర్యంలో గాంధీ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వాసుబాబు మాట్లాడుతూ విద్యార్థులు గాంధీ మార్గంలో నడవాలని సూచించారు. రాజకీయ నాయకులలో గాంధీ తత్వం పెంపొందాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా స్థాయిలో గాంధీ జీవిత చరిత్రకు సంబంధించి విద్యార్థులకు నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో విజేతలైన 15 మందికి బహుమతులు, జ్ఞాపికలు, ప్రసంసా పత్రాలను ఎమ్మెల్యే వాసుబాబు అందజేశారు. నిడమర్రు మండల మానవత ఆధ్వర్యంలో పెదనిండ్రకొలను ఉన్నత పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థినికి రూ.10వేల నగదు సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్వోదయ మండల జిల్లా కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు, జిల్లా మానవత ఛైర్మన్ సాగిరాజు జానకిరామరాజు, జెడ్పీటీసీ సభ్యుడు కోడే కాశి, మండల మానవత అధ్యక్షుడు నౌడు అచ్చుతరామారావు, కార్యదర్శి సంకు శ్రీను(కాన్వెంట్) మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంకు సత్యకుమార్, పెదనిండ్రకొలను సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

గ్రామ సభల ద్వారా సుపరిపాలన



భీమడోలులో మాట్లాడుతున్న పాము సునీతా మాన్‌సింగ్, జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ

భీమడోలు: గ్రామ సభల ద్వారా గ్రామ పంచాయతీల్లో సుపరిపాలన సాధ్యమవుతుందని భీమడోలు జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ అన్నారు. మండలంలోని భీమడోలు, పోలసానిపల్లి, పూళ్ల తదితర గ్రామాల్లో సోమవారం బాపూజీ మహాత్మగాంధీ 155వ జయంత్యుత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భీమడోలులోని పంచాయతీ ఆవరణలోని గాంధీ విగ్రహానికి సర్పంచ్ పాము సునీతామాన్‌సింగ్, పూళ్లలో మహాత్మాగాంధీ విగ్రహాలకు సర్పంచ్ దాయం సుజాత ప్రసాద్, పోలసానిపల్లి సర్పంచ్ షేక్ రహీమాబేగం హసేనా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. భీమడోలు, పూళ్ల, పోలసానిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన చట్టబద్ధ గ్రామ సభకు గ్రామ సర్పంచులు పాము సునీతామాన్‌సింగ్, దాయం సుజాత ప్రసాద్, షేక్ రహీమాబేగం హసేనాలు అధ్యక్షత వహించారు. ఈ గ్రామ సభల్లో వివిధ శాఖల పనితీరు, సంక్షేమ పథకాల అమలుపై సమీక్షించారు. భీమడోలులో నిర్వహించిన కార్యక్రమంలో జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ, మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షురాలు పాము సునీతామాన్‌సింగ్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్, జాతిపిత మహాత్మగాంధీజీ ఆశయాల సాధనే లక్ష్యంగా పని చేస్తున్నారన్నారు. అర్హులందరికీ పథకాలు అందించేందుకు ప్రభుత్వం ఆదేశానుసారం కృషి చేస్తున్నామన్నారు. పోలసానిపల్లి సభలో సర్పంచ్ షేక్ ర హీమాబేగం హసేనా మాట్లాడుతూ అర్హులందరికీ పథకాలు అందించాలన్న లక్ష్యంతో పని చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి, ఎంపీటీసీ అంబటి దేవీ నాగేంద్రప్రసాద్, ఏఎంసీ ఉపాధ్యక్షుడు పులిచర్ల వెంకట కృష్ణారావు, ఉపసర్పంచ్ పెద్దిరెడ్డి బ్రహ్మనాయుడు, గ్రామకార్యదర్శులు ఎన్.ఠాగూర్, సూర్య, వార్డు సభ్యులు, గ్రామస్తులు, సచివాయల ఉద్యోగులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రికార్డు స్థాయిలో ఇళ్ల పట్టాల పంపిణీ

- ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు
- కొత్తపల్లిలో లబ్ధిదారులకు పట్టాలు అందజేత



కొత్తపల్లిలో మహిళకు ఇళ్ల స్థల పట్టా అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

గణపవరం: పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయడంలో మన రాష్ట్రం దేశంలోనే సరికొత్త రికార్డు సృష్టించిందని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. గణపవరం మండలం కొత్తపల్లిలో గాంధీ జయంతి సందర్భంగా పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు సర్పంచ్ మద్దాల రత్నకుమారి అధ్యక్షత వహించారు. ఈ సభలో వాసుబాబు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన తొలి ఏడాదిలోనే రాష్ట్రంలో 33 లక్షల మంది పేదలకు ఒకేసారి ఇళ్ల స్థలాలను పంపిణీ చేసిందని, దేశంలోని మరే రాష్ట్రంలోనూ ఒకేసారి ఇంత భారీ సంఖ్యలో ఇళ్ల స్థలాలు ఇచ్చిన దాఖలాల్లేవన్నారు. రెండు దశాబ్దాల క్రితం ఊరూరా పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇందిరమ్మకాలనీలు నిర్మించిన దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి తర్వాత ఆయన తనయుడు వైఎస్ జగన్ మాత్రమే పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి పక్కా గృహాలు నిర్మిస్తున్నారని అన్నారు. చంద్రబాబు ఐదేళ్ల పాలనలో కనీసం 30 మందికైనా ఇళ్ల స్థలాలు ఇచ్చారా అని ఆయన ప్రశ్నించారు. కొత్తపల్లిలో ఇప్పుడు ఇస్తున్న ఇళ్ల స్థలాల పట్టాలు వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నకాలంలో ఇచ్చినవని, అప్పట్లో టీడీపీ నాయకులు కోర్టులకు వెళ్లడంతో లబ్ధిదారులకు ఇప్పటి వరకూ స్థలాలు దక్కలేదని అన్నారు. ఇన్నేళ్లకు వారి చేతికి పట్టాలు అందిస్తున్నామని చెప్పారు. నాలుగేళ్లగా సీఎం వైఎస్ జగన్ పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా టీడీపీ నాయకులు న్యాయపరమైన ఎన్నో అడ్డంకులు కల్పించారని అన్నారు. వాటన్నింటినీ అధిగమించి సుమారు 33 లక్షల మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి జగనన్న కాలనీల పేరుతో కొత్త ఊళ్లు నిర్మిస్తున్నామన్నారు. పేద, మధ్య తరగతి ప్రజల కోసం ఇన్ని పథకాలు అమలుచేస్తున్న వైఎస్ జగన్‌ను మళ్లీ తిరిగి అధికారంలోకి తీసుకురావలసిన బాధ్యత మనపై ఉందన్నారు. ఈ సందర్భంగా 104 మందికి ఇళ్ల పట్టాలు అందజేశారు. వీరందరికీ ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మద్దాల వెంకటేశ్వరరావు, ఎంపీపీ అర్ధవరం రాము, జెడ్పీటీసీ సభ్యురాలు దేవారపు సోమలక్ష్మి, మండల గృహసారథుల కన్వీనర్ మద్దాల రామకృష్ణ, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ దండు రాము, తహసీల్దార్ పమ్మి లక్ష్మి ఎంపీడీవో జ్యోతిర్మయి, జిల్లా వ్యవసాయ సలహా సంఘం చైర్మన్ వెజ్జు వెంకటేశ్వరరావు వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు కైకరంలో గడపగడపకు మన ప్రభుత్వం

ఉంగుటూరు: కైకరం గ్రామంలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైసీపీ మండల పార్టీ అధ్యక్షుడు మరడ మంగరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పాల్గొంటారని తెలిపారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికార్లు పాల్గొనాలని కోరారు.

బాలికను వేధిస్తున్న వ్యక్తిపై పోక్సో కేసు

దెందులూరు: మండలంలోని కొవ్వలిలో బూసి ప్రకాష్‌రాజ్‌పై పోక్సో కేసు నమోదు చేశామని దెందులూరు ఎస్సై వీర్రాజు తెలిపారు. బూసి ప్రకాష్‌రాజ్ గ్రామంలోని బాలికను ప్రేమించకపోతే చంపేస్తానంటూ బెదిరించడం, వేధించడం, పాఠశాలకు వెళ్లి, వచ్చేటప్పుడు భయాందోళనకు గురిచేయడంతో తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు. దీనిపై విచారణ నిర్వహిస్తున్నామని ఎస్సై వివరించారు.

పారిశుధ్య కార్మికుల ఆరోగ్య భద్రతపై ప్రభుత్వం దృష్టి



భీమడోలు సీహెచ్‌సీలో క్లాప్‌మిత్రలకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యులు, ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి

భీమడోలు: రాష్ట్ర ప్రభుత్వం పారిశుధ్య కార్మికుల ఆరోగ్య రక్షణకు ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని భీమడోలు ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి అన్నారు. జగనన్న స్వచ్ఛ సంకల్పంలో పని చేస్తున్న మండల పరిధిలోని 17 గ్రామ సచివాలయాల్లోని 90 మంది క్లాప్ మిత్రలకు సోమవారం భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరంలో వారికి వైద్య పరీక్షలు చేశారు. ఈ శిబిరాన్ని ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి ప్రారంభించారు. పారిశుధ్య కార్మికుల ఆరోగ్యం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టడం చాలా సంతోషదాయకమన్నారు. స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ లక్ష్య సాధనలో క్లాప్ మిత్రలు సేవలు వెలకట్టలేనివన్నారు. వైద్యుల సూచనల మేరకు ఆరోగ్యశ్రీ పథకంలో వారికి మెరుగైన వైద్య సేవలను అందిస్తామన్నారు. ఆసుపత్రి పర్యవేక్షకురాలు సునీత ఆధ్వర్యంలో వైద్యులు, సిబ్బంది వారికి వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేసారు. ఈవోఆర్డీ సుందరి, గ్రామ కార్యదర్శులు ఎస్.ఠాగూర్, వైవీఎం సూర్యకుమార్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

క్లాప్ మిత్రల కుటుంబానికి ఆరోగ్య పరీక్షలు

పెదపాడు: జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పెదపాడు మండలంలోని వివిధ గ్రామాల్లో క్లాప్ మిత్రలకు వారి కుటుంబ సభ్యులకు పీహెచ్‌సీల్లో వైద్య పరీక్షలు సోమవారం నిర్వహించినట్టు డాక్టరు చక్రధర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పెదపాడు మండల ఈఓపీఆర్డీ సాధనాల సూర్యకుమార్, డాక్టరు పాల్ పెదపాడు ఈఓ దాగాని వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు

పెదవేగి : గాంధీ జయంతిని పురస్కరించుకుని పెదవేగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండలంలోని పారిశుధ్య కార్మికులకు సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాలను అనుసరించి పెదవేగి పీహెచ్‌సీలో సోమవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పెదవేగి ఎంపీపీ తాతా రమ్య ప్రారంభించారు. మండలంలోని అన్ని పంచాయతీల్లోని పారిశుధ్య కార్మికులకు పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులను అందించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు. డాక్టర్ మాధవి, డాక్టర్ భార్గవి, భువనేశ్వరి ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ విశ్వేశ్వరరావు, పెదవేగి ఎంపీడీవో జి రాజ్‌మనోజ్, సీహెచ్‌ఓ రోజ్‌మేరి, వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

దెందులూరు, ఉంగుటూరు

9912220559

90102 23729

63097 62918

Office mail : tpgadvt@gmail.com